సాక్షి
నిర్మల్
శుక్రవారం । 16 । ఆగస్టు । 2024


విద్యార్థుల పిరమిడ్ ప్రదర్శన


జెండా వందనం చేస్తున్న సిరిసిల్ల రాజయ్య, కలెక్టర్ అభిలాష అభినవ్, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తదితరులు


త్రివర్ణ పతాకం దుస్తుల్లో విద్యార్థుల ప్రదర్శన

స్మరిద్దాం.. సాధిద్దాం




స్వామి వివేకానంద, ఝాన్సీ లక్ష్మీబాయి వేషధారణలో చిన్నారులు

- వారి ఆశయాలను సాధిద్దాం
- అన్నిరంగాల్లో జిల్లా అభివృద్ధి
- రుణమాఫీతో రైతులకు పండుగ
- సొంతింటి కలను నిజం చేస్తాం
- రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య
- జిల్లా కేంద్రంలో జాతీయ జెండా ఆవిష్కరణ
- అంబరాన్నంటిన పంద్రాగస్టు సంబురాలు


మాట్లాడుతున్న స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజయ్య


నృత్యం చేస్తున్న విద్యార్థినులు


బాసర ట్రిపుల్ ఐటీలో సాంస్కృతిక ప్రదర్శన


పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న రాజయ్య

నిర్మల్: స్వాతంత్య్రం కోసం బ్రిటీషర్లతో పోరాడి, ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించిన త్యాగధనులందరినీ స్మరించుకోవాల్సిన బాధ్యత భారతీయులుగా మనందరిపై ఉందని, వారి ఆశయాల సాధన కోసం, నవభారత నిర్మాణంలో ప్రతీఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీస్టేడియంలో పంద్రాగస్టు వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా సిరిసిల్ల రాజయ్య హాజరయ్యారు. ముందుగా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీషర్మిల, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్‌తో కలిసి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. జాతీయ గీతం ఆలపించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. తర్వాత రాజయ్య తన ప్రసంగ పాఠాన్ని చదివి వినిపించారు. సుదీర్ఘ పోరాటంతోనే దేశానికి స్వాతంత్య్రం సిద్ధించిందన్నారు. ప్రపంచంలోనే మన దేశం అన్నిరంగాల్లో విప్లవాత్మకమైన అభివృద్ధిని సాధిస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజాసమస్యల పరిష్కారంలో ముందుంటోందన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామన్నారు.

రుణమాఫీ.. రైతన్న హ్యాపీ..

దేశంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ చేసిందన్నారు. ఏకకాలంలోనే అమలు చేసి చరిత్ర సృష్టించామన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ కావడంతో రాష్ట్ర రైతాంగం పండుగ చేసుకుంటున్నారని చెప్పారు. జిల్లాలో రైతు రుణమాఫీ ద్వారా 49,163 మందికి రూ.372 కోట్ల లబ్ధి జరిగిందన్నారు. పంట నమోదు కార్యక్రమం చేపట్టడంతోపాటు రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు సరఫరా చేశామన్నారు. రైతువేదికల ద్వారా వ్యవసాయ నిపుణులు, శాస్త్రవేత్తలతో రైతుల సందేహాలను నివృత్తి చేస్తున్నామన్నారు.

ప్రతీ ఇంటి 'మహాలక్ష్మి' కోసం..

రాష్ట్రంలో ఆడబిడ్డలతోపాటు ట్రాన్స్‌జెండర్లూ ఎక్కడికైనా వెళ్లేందుకు మహాలక్ష్మి పథకంలో భాగంగా ఉచిత బస్సు ప్రయాణాన్ని అందిస్తున్నామన్నారు. ఈ పథకం ద్వారా జిల్లాలో ఇప్పటి వరకు 1.02,36,231 మంది మహిళలు ఉచితంగా రవాణా సదుపాయాన్ని సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. దీని ద్వారా జిల్లా మహిళలకు రూ.40,37,45,400 లబ్ధి చేకూరిందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికీ సొంతిళ్లు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఈ పథకం కింద ఒక్క ఏడాదిలోనే 4.50 లక్షల ఇళ్లు నిర్మించనున్నట్లు చెప్పారు.

వైద్యానికి పెద్దపీట..

రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెడుతోందని, ఇందుకోసం వైద్య కళాశాలలు, ఆస్పత్రులకు తగిన నిధులను అందిస్తున్నామన్నారు. జిల్లా మెడికల్ కాలేజీలో వందమంది విద్యార్థులకు బోధన అందుతోందన్నారు. 8 మంది ప్రొఫెసర్లు, 22 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు సహా 77 మంది బోధనా సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నట్లు చెప్పారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయడంతోపాటు రూ.10 లక్షల వరకూ ఉచిత వైద్యం అందిస్తున్నామన్నారు.

'గృహజ్యోతి' వెలుగులు..

జిల్లాలో 3,41,212 విద్యుత్ కనెక్షన్లు ఉండగా, గృహజ్యోతి పథకం ద్వారా 1,14,000 కుటుంబాలకు జీరోబిల్లులు వస్తున్నాయన్నారు. టీఎస్ ఐపాస్ ద్వారా పారిశ్రామిక విద్యుత్ కనెక్షన్ల కోసం 2024–25 సంవత్సరానికి దాదాపు 3 వేల విద్యుత్ కనెక్షన్లు వివిధ కేటగిరీల కింద అందించామన్నారు.

నీటి పారుదలకు..

జిల్లాలో కాళేశ్వరం పథకంలో భాగమైన 27 ప్యాకేజీకి రూ.609 కోట్ల ఖర్చుతో 75 శాతం పనులు పూర్తి చేశామన్నారు. 28వ ప్యాకేజీ కింద రూ.235 కోట్లతో పనులు చేపట్టినట్లు చెప్పారు. నిర్మల్, జగిత్యాల జిల్లాల్లో 18 వేల ఎకరాల్లో ఆయకట్టుకు నీరందించేందుకు పొన్కల్‌వద్ద రూ.677 కోట్లతో చేపట్టిన సదర్మాట్ బ్యారేజీకి ఇప్పటి వరకు రూ.424 కోట్లు ఖర్చుచేశామన్నారు. అక్టోబర్ నాటికి పనులు పూర్తవుతాయని వెల్లడించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు కిశోర్‌కుమార్, ఫైజాన్ అహ్మద్, ఆర్డీవో రత్నకల్యాణి, భైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, జిల్లా ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు..

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహించిన పంద్రాగస్టు వేడుకల్లో భాగంగా జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆలోచింపజేశాయి. ప్రధానంగా సైనికుల విధులు, వారి అసమాన త్యాగాలు, ఆ కుటుంబాల మనోధైర్యాలను చిన్నారులు చక్కగా ప్రదర్శించారు. భారీ సంఖ్యలో విద్యార్థులు చేసిన బంజారా నృత్యం, నెత్తురు మరిగితే ఎత్తర జెండా, వందే మాతరం అంటూ చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను అతిథులు ఆసక్తిగా వీక్షించారు. అనంతరం శాఖలవారీగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి పంద్రాగస్టు పురస్కార పత్రాలను అతిథులు అందించారు.

శకటాల ప్రదర్శన..

డీఆర్డీఏ శకటం, వ్యవసాయ, ఉద్యాన పట్టు పారిశ్రమ శాఖల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రదర్శించారు. జిల్లా పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శకటం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గురించి ప్రదర్శించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 108, 102, 1962 వాహనాల ద్వారా జిల్లా ప్రజలకు అందుతున్న సేవలను వివరించారు. అగ్నిమాపక శాఖ ద్వారా అందుతున్న సేవలను శకటం ద్వారా వివరించారు.

సందడిగా స్టాళ్లు

వేడుకల్లో జిల్లా గ్రామీణ అభివృద్ధి, పట్టు పరిశ్రమలు, మిషన్ భగీరథ, వైద్య, ఆరోగ్య, వ్యవసాయ శాఖ, అటవీశాఖ, విజయ డెయిరీ, చౌక దుకాణం, విద్యాశాఖ స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. వీటిద్వారా అందుతున్న సేవలను వివరించారు.

వివిధ శాఖల ద్వారా..

- జిల్లాలో గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా ఎన్నో వినూత్న కార్యక్రమాలను చేపట్టామన్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా ఇప్పటివరకు 49.89 లక్షల పనిదినాలు కల్పించి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచామన్నారు. బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి రుణాల్లోనూ రాష్ట్రంలో వరుసగా ప్రథమ స్థానంలో నిలుస్తుండటం విశేషమన్నారు.
- వన మహోత్సవంలో భాగంగా జిల్లాలో 2024–25 సంవత్సరంలో 32 లక్షల మొక్కలు నాటడం లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 15 లక్షల మొక్కలు నాటామన్నారు. మరో 9 లక్షలను ఇంటిపరిసరాల్లో నాటినట్లు చెప్పారు.
- విద్యాశాఖ ద్వారా అత్యుత్తమ ఫలితాలను సాధిస్తున్నామన్నారు. వరుసగా పదో తరగతి ఫలితాల్లో జిల్లా రాష్ట్రంలో నిలువడం విశేషమన్నారు.
- ఆగస్టు 5 నుంచి 9 వరకు స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమం ద్వారా పట్టణాలు, గ్రామాల్లో పలు కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు.
- పౌరసరఫరాల ద్వారా యాసంగిలో 40,366 మంది రైతుల నుంచి 1,57,785 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి, రూ.347 కోట్ల 54లక్షలను వారి ఖాతాల్లో జమచేశామన్నారు.
- జిల్లాలో ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమం కోసం సంబంధిత శాఖల ద్వారా స్కాలర్‌షిప్‌లు, ఇతర రుణాలను అందిస్తున్నామన్నారు.
- మత్తురహిత జిల్లాగా చేసేందుకు పోలీసుల, ప్రొహిబిషన్ శాఖలు పక్కాగా పనిచేస్తున్నాయని రాజయ్య వివరించారు.


పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శకటం




సాంస్కృతిక ప్రదర్శనల విజేతలకు బహుమతులు అందిస్తున్న సిరిసిల్ల రాజయ్య, అభిలాష అభినవ్, మహేశ్వర్‌రెడ్డి


పరేడ్ నిర్వహిస్తున్న పోలీసులు

స్వాతంత్య్ర సంగ్రామం నుంచి స్ఫూర్తి పొందాలి


క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

- కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: అధికారులంతా స్వాతంత్య్ర సంగ్రామం నుంచి స్ఫూర్తిని పొందాలని దేశాభివృద్ధికి తోడ్పడాలని కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. 78వ భారత స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా తన క్యాంప్ ఆఫీస్, సమీకృత కలెక్టరేట్ ఆవరణలో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ప్రజలకు, అధికారులకు, సిబ్బందికి కలెక్టర్ స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో చిన్నారులకు నోటు పుస్తకాలు, బహుమతులు, మిఠాయిలు పంచారు. కార్యక్రమాలలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్ కుమార్, డీఆర్వో భుజంగరావు, ఆర్డీవో రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోరాట స్ఫూర్తిని నింపాలి

- ఎస్పీ జానకీషర్మిల

నిర్మల్‌టౌన్: భవిష్యత్‌తరాల్లో స్వాతంత్య్ర సమరయోధుల పోరాట స్ఫూర్తిని నింపాలని జిల్లా ఎస్పీ జానకీషర్మిల సూచించారు. ఎస్పీ క్యాంపు ఆఫీస్, పోలీసు ప్రధాన కార్యాలయంలో 78వ స్వాతంత్య్ర వేడుకలల్లో ఎస్పీ జెండా ఆవిష్కరించారు. పోలీస్ అధికారులు, సిబ్బందికి స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. మాతృ భూమి కోసం ఎందరో మహనీయులు తమ ప్రాణాలను పణంగా పెట్టరని పేర్కొన్నారు. కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, ఇన్‌స్పెక్టర్లు ప్రవీణ్‌కుమార్, నవీన్‌కుమార్, గోపీనాథ్, రామకృష్ణ, ఆర్ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, డీపీవో తదితరులు పాల్గొన్నారు.


జెండా వందనం చేస్తున్న ఎస్పీ, డీఎస్పీ, సిబ్బంది

పాపన్నగౌడ్ జయంతి కమిటీ కన్వీనర్‌గా నర్సాగౌడ్


నర్సాగౌడ్‌ను సన్మానిస్తున్న సిరిసిల్ల రాజయ్య

నిర్మల్‌చైన్‌గేట్: ఈనెల 18 నుంచి 25 వరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 374వ జయంతి వేడుకల కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా అమరవేణి నర్సాగౌడ్ నియమితులయ్యారు. ఈమేరకు బీసీ కార్పొరేషన్ చీఫ్ సెక్రెటరీ బుర్ర వెంకటేశంగౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. నర్సాగౌడ్‌ను స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య గురువారం శాలువాతో సన్మానించారు.

శ్రీకాంతచారి జయంతి

భైంసాటౌన్: తెలంగాణ అమరవీరుడు శ్రీకాంతచారి జయంతిని పట్టణంలోని బస్టాండ్ రోడ్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే పి.రామారావుపటేల్ హాజరై శ్రీకాంతచారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు సుంకెట పోశెట్టి, మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తాలోడ్ శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు గోపాల్‌సర్డా, నాయకులు సోలంకి భీంరావు, బి.గంగాధర్, కౌన్సిలర్లు తోట విజయ్, గౌతం పింగ్లే, తదితరులు పాల్గొన్నారు.

బాసరలో భద్రత డొల్ల!?

- 'ఉగ్ర' హిట్ లిస్ట్‌లో బాసర ఆలయం..?
- రైల్వేస్టేషన్‌లోనూ దొంగతనాలు
- లాడ్జీలో అసాంఘిక కార్యకలాపాలు
- తాజాగా బాసర ఆలయంలో చోరీ

భైంసా: దేశంలోని శక్తిపీఠాల్లో బాసర సరస్వతీ క్షేత్రం ఒకటి. నిత్యం ఇక్కడికి వేల మంది భక్తులు వస్తుంటారు. అమ్మవారిని దర్శించుకుంటారు. ఆలయ గదులు తక్కువగా ఉండడం, సదుపాయాలు లేకపోవడంతో ప్రైవేటు లాడ్జీల్లో ఉంటారు. ఇక ఇక్కడికి వచ్చేవారు రైలు, రోడ్డు మార్గాల్లో వస్తుంటారు. అయితే బాసరలో భద్రతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆలయం ఉగ్రవాదుల హిట్ లిస్ట్‌లో ఉన్నట్లు కేంద్ర నిఘావర్గాలు సైతం హెచ్చరికలు జారీచేశాయి. అయినా ఆలయ భద్రత విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. వాటికి బలం చేకూర్చేలా తాజాగా ఆలయంలో చోరీ జరిగింది. ఇక రైల్వే స్టేషన్, బస్టాండ్‌లో దొంగతనాలకు లెక్కేలేదు. ఇక బాసర గోదావరి వంతెన సూసైడ్ స్పాట్‌గా మారింది. ఇక్కడకు వచ్చిన భక్తులు నదీ స్నానం చేస్తూ నీటిలో మునిగితే రక్షించేవారు లేరు. ఆలయానికి సంబంధించి ప్రత్యేక భద్రత బలగాలు, పటిష్టమైన నిఘా వ్యవస్థ ఉండాలని అంతా కోరుతున్నా ఇక్కడ ఆ పరిస్థితి లేదు.

మహారాష్ట్ర సమీపంలో...

బాసర ఆలయం మహారాష్ట్రకు సరిహద్దుగా ఉంది. రైల్వే స్టేషన్‌కు కొద్ది దూరంలోనే దొంగతనాలు జరుగుతున్నాయి. ఔరంగాబాద్‌కు చెందిన అంధ భక్తులు వేసవిలో బాసర ఆలయానికి వచ్చారు. ఆ సమయంలోనూ ఈ కుటుంబం దొంగలచేతిలో డబ్బులు పోగొట్టుకుని ఇంటికి వెళ్లిపోయారు. ఔరంగాబాద్ నుంచి వచ్చిన ఈ కుటుంబం బాసర అమ్మవారిని దర్శించుకుని ఇక్కడి నుంచే తీర్థ క్షేత్రాలకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. బాసర రైల్వేస్టేషన్‌లో దొంగతనం జరుగడంతో ఇంటికి వెళ్లిపోయారు. గతంలో పదుల సంఖ్యలో ద్విచక్రవాహనాలు చోరీ అయ్యాయి. దొంగతనాలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. ఇటీవలే బాసర ఆలయంలో ప్రసాదాల కౌంటర్‌లో గోల్‌మాల్ జరిగింది. ఇలా ఏ విషయం జరిగినా, ఏ సంఘటన చోటుచేసుకున్నా చుట్టూ సీసీ కెమెరాలు ఉంటాయి. సీసీ కెమెరాల దృశ్యాలను ఎందుకు పర్యవేక్షించడంలేదో అర్థం కావడంలేదు. బాసర ఆలయం, పరిసరాలు, ప్రధాన రోడ్లు, రైల్వేస్టేషన్, అన్నిచోట్లా సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయా లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నిఘా కరువు...

మరోవైపు బాసరలోని కొన్ని ప్రైవేటు లాడ్జీలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. మహారాష్ట్ర నుంచి వచ్చే కొన్ని జంటలు లాడ్జీల్లో అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఇక మహారాష్ట్ర నుంచి బాసర మీదుగా గంజాయి, మద్యం అక్రమ రవాణా జరుగుతోంది. బాసరలోని ట్రిపుల్‌ఐటీ కళాశాలలో గతంలో గంజాయి పట్టుబడింది. పకడ్బందీ భద్రత ఉన్న ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లోకి గంజాయి తీసుకువెళ్తున్నారంటే ఇక్కడ తనిఖీలు నామ మాత్రంగానే ఉన్నాయని స్పష్టమవుతోంది. బాసర రైల్వేస్టేషన్ నుంచి బస్టాండ్ వరకు ఉన్న మార్గంలో అక్రమంగా బెల్టుషాపులు నిర్వహిస్తున్నా పట్టించుకోవడంలేదు. రాత్రి వేళల్లో దొంగలు బెల్ట్ షాపుల్లో మద్యం సేవించి రైల్వేస్టేషన్, బస్టాండ్ ఇతర ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇక బాసర ఆలయంలోనూ అప్పుడప్పుడు దొంగతనాలు జరుగుతున్నాయి. ముఖ్య పర్వదినాల్లో, రద్దీ ఎక్కువ ఉన్న రోజుల్లో బాసర స్నానఘట్టాల వద్ద, క్యూలైన్‌లలో భక్తుల జేబులు కత్తిరిస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులను రద్దీ ఉన్న సమయంలో దొంగతనాలు చేసి జేబులు ఖాళీచేస్తున్నారు. బాసరలో దొంగలపై దృష్టిపెట్టడంలేదు.


బాసర ఆలయం

ఎస్పీతో మాట్లాడాను

బాసర ఆలయంలో దొంగతనం విషయం ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడాను. దొంగలు ఆలయంలో స్లాబుపై నుంచి దిగి దత్తాత్రేయ ఆలయం సమీపంలోని హుండీని పగులగొట్టారు. ప్రసాదాల కౌంటర్‌లోనూ దొంగలు పడ్డారు. అక్కడ ఉండే హోంగార్డులు సక్రమంగా విధులు నిర్వర్తించడంలేదు. ఈ విషయంలో ఎస్పీతో మాట్లాడి పనిచేయని వారిని తొలగించి కొత్తవారిని నియమించాలని కోరాం. బాసర ఆలయంలో పోలీస్ పోస్టు ఏర్పాటుచేసి నిఘా పటిష్టం చేయాలని సూచించాం. బాసర ఆలయంలో భద్రతను పటిష్టంచేసేలా చూస్తాం.

– రామారావుపటేల్, ముథోల్ ఎమ్మెల్యే

క్లుప్తంగా

ఆస్ట్రేలియాలో మాజీ ఎమ్మెల్యేకు సత్కారం



విక్టోరియా మంత్రి చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న రేఖానాయక్

ఖానాపూర్: ఆస్ట్రేలియాలోని విక్టోరియా రాష్ట్రంలో ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ సత్కారం పొందారు. అక్కడి ఉద్యోగాలు, పరిశ్రమలు, మహిళాశాఖ, ట్రీటి అండ్ ఫస్ట్ పీపుల్స్ మంత్రి "నాటలి హచిన్స్" చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. విక్టోరియాలో నిర్వహించిన భారత 78వ స్వాతంత్య్ర వేడుకల్లో రేఖానాయక్ పాల్గొన్నారు. తెలంగాణ ఉత్తమ ప్రజాప్రతినిధిగా గుర్తించి సత్కరించారు.

కళాకారునికి ప్రశంస



వేణుగోపాలకృష్ణను సన్మానిస్తున్న రాజయ్య

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ లఘుచిత్ర కళాకారుడు, ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ వేణుగోపాలకృష్ణను రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య గురువారం సన్మానించారు. స్వాతంత్య్ర వేడుకల ముఖ్య అతిథిగా విచ్చేసిన సిరిసిల్ల రాజయ్య డాక్టర్ వేణుగోపాలకృష్ణ సామాజిక, కళారంగాల్లో చేస్తున్న సేవలను ప్రశంసించారు. శాలువా, జ్ఞాపికలతోపాటు ప్రశంసాపత్రం అందించి సత్కరించారు. డాక్టర్ వేణుగోపాలకృష్ణ గతంలో పలుమార్లు ఉత్తమ వైద్యాధికారిగా పురస్కారాలు అందుకున్నారు. ఆయన నటించిన ప్రేమతో నాన్న లఘు చిత్రానికి రాష్ట్రస్థాయి పురస్కారం లభించింది. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు, నాయకులు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, వైద్యులు దామెర రాములు, నారాయణ గౌతమ్, ఉదయ్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్‌కు గాయాలు



గాయపడ్డ ఆర్టీసీ డ్రైవర్ జలెందర్

కుంటాల: మండలంలోని కల్లూర్–కుంటాల రహదారిపై అందాకూర్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ అరిగెల జలెందర్‌కు గాయాలయ్యాయి. విధులు ముగించుకున్న జలెందర్ ద్విచక్ర వాహనంపై కుంటాలకు వస్తుండగా పెంచికల్‌పాడ్ నుంచి బైక్‌పై వస్తున్న గంగాధర్ ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. కల్లూరు నుంచి కుంటాలకు వెళ్తున్న స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ వర్ధన్ రెడ్డి ప్రథమ చికిత్స అందించగా ఎస్సై రజినీకాంత్ పోలీస్ వాహనంలో కల్లూరు వరకు తీసుకెళ్లి అక్కడి నుంచి 108లో భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ప్రమాదవశాత్తు గోదావరిలోపడి ఒకరు మృతి

బాసర: ప్రమాదవశాత్తు గోదావరిలోపడి ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై గణేశ్ తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని రవీంద్రపూర్ కాలనీకి చెందిన వాడ్కే అశోక్ (46) కొంతకాలంగా మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో మిషన్ భగీరథలో వాటర్ సప్లై హెల్పర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం రాత్రి 8 గంటలకు ట్యాప్ తిప్పడానికి వెళ్లి ప్రమాదవశాత్తు గోదావరిలో పడిపోగా గురువారం మృతదేహం లభ్యమైంది. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

'కడెం' గేటు ఎత్తివేత



కడెం: కడెం ప్రాజెక్టుకు గురువారం 3,010 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో అధికారులు ఒక వరద గేటు ఎత్తారు. 3,965 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ప్రాజెక్ట్‌పూర్తి స్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా, ప్రస్తుతం 698.275 అడుగులు ఉంది. దీంతో వరద పెరిగే అవకాశం ఉండడంతో నీటిని దిగువకు వదులుతున్నారు.

శాటిలైట్ సెంటర్ హెచ్‌డబ్ల్యూవో సస్పెన్షన్

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ మండలం పోతగూడ 2లోని గిరిజన శాటిలైట్ సెంటర్ హెచ్‌డబ్ల్యూవో జైవంత్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ రాజర్షిషా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం శాటిలైట్ సెంటర్‌నుఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ నిత్యావసర సరుకులు భద్రపరిచే గదితోపాటు పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంతో నిర్లక్ష్యంగా వ్యవహరించిన హెచ్‌డబ్ల్యూవోపై సస్పెన్షన్ వేటు వేశారు.

ఉత్తములకు 'ప్రశంస'లు



అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌కు ప్రశంసాపత్రం అందిస్తున్న సిరిసిల్ల రాజయ్య, అభిలాష అభినవ్

నిర్మల్ జిల్లాలో వివిధ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన 250 మంది అధికారులు, ఉద్యోగులకు 78వ స్వాతంత్య్ర దినోత్సం సందర్భంగా ప్రశంసాపత్రాలు ప్రదానం చేవారు. ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజయ్య, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీషర్మిల ప్రశంసాపత్రాలు అందించారు. – నిర్మల్‌చైన్‌గేట్



కిశోర్‌కుమార్, అదనపు కలెక్టర్



అవినాష్ ఏఎస్పీ, భైంసా



ప్రసాద్‌రెడ్డి, డీఎఫ్‌వో



భుజంగరావ్, డీఆర్వో



కె.విజయలక్ష్మి, డీఆర్డీవో | రత్నకల్యాణి, ఆర్డీవో, నిర్మల్ | రవీందర్‌రెడ్డి, డీఈవో | అంజిప్రసాద్, డీఎఫ్‌వో | లక్ష్మి, ఇరిగేషన్ ఈఈ



అశోక్‌కుమార్, ఆర్‌అండ్‌బీ ఈఈ | కోమల్‌రెడ్డి, ఆర్డీవో, భైంసా | రాజేందర్, ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో | సునీల్, జీజీహెచ్ సూపరింటెండెంట్ | సరోజ, ప్రసూతి ఆస్పత్రి, హెచ్‌వోడీ | రాంగోపాల్, లీడ్ బ్యాంకు మేనేజర్ | గంగారెడ్డి, డీఎస్పీ, నిర్మల్ | ఎంఏ.నదీమ్, ఐటీ | సూర్యరావు, ఏవో, కలెక్టరేట్



కార్తీక్‌రెడ్డి, సివిల్‌సప్లయ్ | కాశీనాథ్, భైంసా ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ | మమత, స్టాఫ్‌నర్స్, భైంసా | జయలక్ష్మి, హెడ్‌నర్స్, జనరల్ ఆస్పత్రి | అరుణ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ | సందీప్, జూనియర్ అసిస్టెంట్, డీపీఆర్వో | సరిత, శ్రీనిధి మేనేజర్ | నవీన్‌కుమార్, టౌన్ సీఐ, నిర్మల్ | మల్లేశ్, సీఐ ముధోల్



శ్రీకాంత్, ఎస్సై సారంగపూర్ | లింబాద్రి, ఎస్సై, ఖానాపూర్ | జాదవ్ సంతోష్, ఎస్‌బీ కానిస్టేబుల్ | గంగాధర్, జూనియర్ అసిస్టెంట్, డీపీవో | స్వాతి, తహసీల్దార్ దిలావాపూర్ | రాజు తహసీల్దార్, నిర్మల్ అర్బన్ | ముత్యం, నాయబ్ తహసీల్దార్ | శ్రీనివాస్ జూనియర్ అసిస్టెంట్, అటవీశాఖ | నరేశ్, జూనియర్ అసిస్టెంట్, డీపీఆర్వో



మహేందర్, ఎంవీఐ | తేజ, కానిస్టేబుల్, రవాణాశాఖ | శ్రీలత, అసిస్టెంట్ మేనేజర్ | మహేశ్, జూనియర్ అసిస్టెంట్ హార్టికల్చర్ | రాజు, డేటాఎంట్రీ ఆపరేటర్ | చంద్రమణి, సీనియర్ అసిస్టెంట్ | కిష్టారెడ్డి, హెచ్‌డబ్ల్యూవో | రమాదేవి, డీటీ, సివిల్ సప్లయ్ | శ్రీదేవి, సూపరింటెండెంట్, ఎస్సీ కార్పొరేషన్

హైదరాబాద్‌లో భైంసా విద్యార్థి ఆత్మహత్య



చికిత్స పొందుతున్న దేవిదాస్



నవదీప్(ఫైల్)

భైంసాటౌన్: పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన ఇంటర్ ఫస్టియర్ విద్యార్థి నవదీప్(16) హైదరాబాద్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు నవదీప్ పదోతరగతి వరకు ముధోల్‌లోని సాంఘిక సంక్షేమ బీసీ బాలుర గురుకుల పాఠశాలలో చదువగా రంగారెడ్డి జిల్లా గౌలిదొడ్డిలోని సీఓఈ(కాలేజ్ ఆఫ్ ఎక్స్‌లెన్స్)లో సీటు రావడంతో ఇంటర్ ఫస్టియర్‌లో చేరాడు. ఈ క్రమంలో ఇటీవల సెలవుల నిమిత్తం భైంసాలోని తల్లిదండ్రుల వద్దకు వచ్చి తిరిగి వెళ్లేందుకు హైదరాబాద్‌లోని తన సోదరుడి వద్దకు వెళ్లాడు. గురువారం ఉదయం సోదరుడి గదిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలిసిన భైంసాలోని విద్యార్థి తండ్రి గడపాలే దేవిదాస్ స్పృహ తప్పి పడిపోగా కుటుంబ సభ్యులు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా విద్యార్థి ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదని చెప్పారు.

వేతనం రాక ఆగిన ఊపిరి



ప్రభాకర్ మృతదేహం



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

- గుండెపోటుతో మిషన్ భగీరథ వాటర్ మెన్ మృతి
- ఏడు నెలలుగా జీతం ఇవ్వని కాంట్రాక్టు సంస్థ
- కుటుంబ పోషణకు అప్పులు.. మానసిక ఒత్తిడి..
- మృతదేహంతో బంధువుల ఆందోళన

ముథోల్: ఏడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో మిషన్ భగీరథ వాటర్‌మెన్ మానసిక ఒత్తిడికి లోనై గుండెపోటుతో మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పందిర్ల ప్రభాకర్(38) ఫిల్టర్ బెడ్ నిర్వహణ చూసుకునే ఓ ప్రైవేటు ఏజెన్సీ తరఫున వాటర్ మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఏజెన్సీ సిబ్బందికి ఏడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు మొదలయ్యాయి. ఈ క్రమంలో ప్రభాకర్ మానసిక ఒత్తిడికి లోనయ్యాడు. గురువారం గుండెపోటుతో మృతిచెందాడు.

మృతదేహంతో ఆందోళన..

వేతనం రాకపోవడంతోనే ప్రభాకర్ గుండెపోటుకు గురై మృతిచెందాడని కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు మృతదేహాన్ని ఫిల్టర్ బెడ్ వద్దకు తీసుకెళ్లారు. అక్కడే ఉంచి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని ఆందోళన చేశారు. మిషన్ భగీరథ ఏఈఈ సుమన్, ఏజెన్సీ ప్రతినిధి అజయ్ అక్కడి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై సాయికిరణ్ అక్కడి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. ఇరు వర్గాల మధ్య రాజీ కుదరకపోవడంతో రాత్రి 8 గంటల వరకు మృతదేహంతో ఆందోళన కొనసాగించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య



జాదవ్ భరత్ (ఫైల్)

బోథ్: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్టేషన్ హౌస్ ఆఫీసర్ గంగారెడ్డి తెలిపిన వివరాల మేరకు మండలంలోని సాకెర గ్రామానికి చెందిన జాదవ్ భరత్(50) నాలుగేళ్ల క్రితం పెద్ద కుమార్తె, రెండేళ్ల క్రితం చిన్న కుమార్తె వివాహం జరిపించాడు. పెళ్లిళ్లతో పాటు పంటల సాగుకోసం అప్పు చేశాడు. తీర్చేమార్గం కనిపించకపోవడంతో కొన్నిరోజులుగా మనస్తాపానికి గురవుతున్నాడు. గురువారం మధ్యాహ్నం తన చేనులో పురుగుల మందు తాగాడు. ఫోన్ చేసినా ఎత్తక పోవడంతో కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి చూడగా చేనులో పడిపోయి ఉన్నాడు. వెంటనే మండల కేంద్రంలోని సీహెచ్‌సీకి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య విజయబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌హెచ్‌వో గంగారెడ్డి తెలిపారు.

బాదన్‌కుర్తి బ్రిడ్జికి 'రాథోడ్' పేరు



ఏర్పాటు చేసిన బోర్డు వద్ద గ్రామస్తులు

ఖానాపూర్: మండలంలోని బాదన్‌కుర్తి గ్రామానికి వెళ్లే మార్గంలో ఉన్న బ్రిడ్జికి గురువారం గ్రామస్తులు రాథోడ్ రమేశ్ పేరుతో నామకరణం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2008–2009లో బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యేగా, జెడ్పీ చైర్మన్‌గా ఉన్న రాథోడ్ రమేశ్ కుటుంబం చేసిన సేవలు మరువలేనివన్నారు. రెండు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన రాథోడ్ రమేశ్‌కు ఘనంగా నివాళులర్పించారు. త్వరలో రాథోడ్ రమేశ్ విగ్రహాన్ని సైతం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పార్వపు శ్రీనివాస్, ఏఎంసీ మాజీ చైర్మన్ శనిగారపు శ్రావణ్, ఉపసర్పంచ్ మాదాస్తు నవీన్, వీడీసీ నాయకులు మాసుల రాజేశ్వర్, బూరుగుల నాగేశ్, దొనకంటి రవి, తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ సద్భావన యాత్రలో విషాదం

- బెంగళూరుకు చెందిన వృద్ధుడు హఠాన్మారణం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చేరిన రాజీవ్ సద్భావన యాత్రలో విషాదం చోటు చేసుకుంది. యాత్రలో భాగంగా బుధవారం ఆదిలాబాద్ పట్టణానికి చేరుకోగా స్థానిక కాంగ్రెస్ నాయకుడు కంది శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో బస చేశారు. అయితే యాత్రికుల్లో ఒకరైన కర్నాటక రాష్ట్రంలోని బెంగళూరుకు చెందిన ఏ.గోమతేశన్ (80)గుండెపోటుకు గురయ్యాడు. హుటాహుటిన స్థానిక రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి రూ.26వేలు వెచ్చించి ప్రత్యేక అంబులెన్స్‌ను ఏర్పాటు చేసి మృతదేహాన్ని స్వస్థలానికి తరలించే ఏర్పాట్లు చేశారు.

దేశసేవలో భాగస్వామ్యం కావాలి



జెండా ఎగురవేస్తున్న వీసీ వెంకటరమణ



విద్యార్థుల నృత్య ప్రదర్శన

- బాసర ట్రిపుల్‌ఐటీ వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ

భైంసా: ప్రతిఒక్కరూ దేశసేవలో భాగస్వామ్యం కావాలని బాసర ట్రిపుల్ ఐటీ వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ అన్నారు. గురువారం ట్రిపుల్‌ఐటీలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్య్రం కోసం ఎంతోమంది ప్రాణాలు అర్పించారన్నారు. యువత దేశానికి వెన్నెముక లాంటివారన్నారు. అనంతరం దేశానికి స్వాతంత్య్రం తీసుకువచ్చిన జాతీయ నాయకులను స్మరించుకున్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు తిలకించారు.

చాక్‌పీస్‌పై జాతీయ జెండా

తాంసి: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని పొన్నారి గ్రామానికి చెందిన కళాకారుడు గట్టు రాజు దేశంపై ఉన్న అభిమానంతో చాక్‌పీస్‌పై జాతీయ జెండాను రూపొందించాడు. రాజు తన కళా నైపుణ్యంతో స్వాతంత్య్ర సమరయోధుల చిత్రాలను సైతం గీస్తూ పలువురిని ఆకర్షింజేస్తూ ఉంటాడు. సుద్దముక్కపై జాతీయ జెండాను రూపొందించిన రాజును పలువురు అభినందించారు.



రాజు తయారు చేసిన జెండా

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువతి మృతి



దీప (ఫైల్)

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర టాకీస్ చౌరస్తా వద్ద ఈ నెల 5న జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ బస్సు రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొన్న ఘటనలో గాయాలపాలైన యువతి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు స్థానిక సాయికుంటకు చెందిన రేగుంట రమేశ్, అతని కూతురు దీప (24), భూపాలపల్లి జిల్లా బండ్లపల్లి గ్రామానికి చెందిన బండి మహేష్, శ్రీరాంపూర్ ఆర్కే6 కాలనీ కొత్తరోడ్‌కు చెందిన బీ. నవీన్ ద్విచక్ర వాహనాలపై వెళ్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. రమేశ్, దీపకు తీవ్ర గాయాలుకావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. తండ్రీ కూతుళ్లకు వేర్వేరు ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తుండగా చికిత్స పొందుతూ దీప గురువారం మృతి చెందింది. బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన దీప జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఉద్యోగం కోసం వెళ్తుండగా ప్రమాదానికి గురైంది.

వేర్వేరు చోట్ల ముగ్గురు ఆత్మహత్య



పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్న శ్రీధర్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రం మంచిర్యాలలోని వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. మద్యం మత్తులో ఒకరు, భార్య వదిలి వెళ్లిందని మరొకరు, అప్పుగా ఇచ్చిన డబ్బు తిరిగి రాలేదని ఇంకొకరు బలవన్మరణానికి పాల్పడ్డారు. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని అశోక్‌రోడ్డుకు చెందిన లెక్కల మహేష్(60) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సనత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మహేష్ కొద్ది రోజులుగా పని చేయకుండా జులాయిగా తిరుగుతుండే వాడు. మద్యానికి బానిసయ్యాడు. గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్యం మత్తులో ఫ్యానుకు ఉరేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

జాఫర్‌నగర్‌లో..

జిల్లా కేంద్రంలోని జాఫర్‌నగర్‌కు చెందిన శుభంమండల్(26) ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానిక ఎస్సై రాములు తెలిపిన వివరాల ప్రకారం.. శుభం మండల్ కొద్ది రోజులుగా మద్యానికి బానిసై పని చేయకుండా జులాయిగా తిరుగుతున్నాడు. దీంతో భార్య అంజూమ్ మండ ల్ పది రోజుల క్రితం తన పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపం చెందిన శుభం మండల్ గురువారం సాయంత్రం మద్యం మత్తులో ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

హమాలీవాడలో..

జిల్లా కేంద్రంలోని హమాలీవాడకు చెందిన తోగరి శ్రీధర్(36) గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానిక ఎస్సై రాములు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీధర్ తన స్నేహితుల్లో కొందరికి సుమారు రూ.40లక్షల వరకు అప్పుగా ఇచ్చాడు. స్నేహితులు తిరిగి ఇవ్వకపోవడం, ఇబ్బందులకు గురి చేయడంతో మనస్తాపం చెంది ఈ నెల 12న మద్యంమత్తులో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు అసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.